క్లుప్తంగా

భిక్షాటన చేసి టేబుళ్ల విరాళం


టేబుళ్లను విరాళంగా అందించిన వెంకటరమణ

తుని రూరల్: తలుపులమ్మ ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ దేవస్థానానికి ఐదు టేబుళ్లను విరాళంగా ఇచ్చి దివ్యాంగురాలు వెంకటరమణ తన దైవభక్తిని చాటుకుంది. ఆమె విజయనగరం నుంచి మూడేళ్ల క్రితం తుని మండలం లోవకొత్తూరులోని లోవ దేవస్థాన ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. రెండు చేతులు లేకపోవడంతో భక్తులు ఇచ్చిన వాటితో గడుపుకుంటూ మిగిలిన డబ్బులు రూ.55వేలతో ఐదు ప్లాస్టిక్ టేబుళ్లను కొనుగోలు చేసి అమ్మవారి సన్నిధికి విరాళంగా అందించడంతో సర్వత్రా అభినందిస్తున్నారు. ఆమె మనోధైర్యం, ఆత్మ విశ్వాసాన్ని చూసి కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, వేదపండితులు, అర్చకులు, ఉద్యోగులు తదితరులు అభినందించారు.

స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో రెండో స్థానం

ఏలేశ్వరం: నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పట్టణానికి చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు రెండో స్థానం పొందారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో మంగళవారం రిటైర్డ్ అధ్యాపకుడు చెన్నా ప్రగడ సత్య గాంధీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏఓ జి.విజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఉషారాణి


ఉషారాణిని అభినందిస్తున్న పార్టీ నేతలు

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు తేజోమూర్తుల ఉషారాణి జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ కౌన్సిల్ సభ్యులు సింగిలీదేవి సత్తిరాజు మాట్లాడుతూ, పార్టీ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన


వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఓ ప్రసాద్, డీఎస్ఓ గణేష్, డీపీఓ మహేష్, డీపీహెచ్ఎన్ నీలవేణి వెల్‌నెస్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10వ తరగతి బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, న్యూట్రిషన్, హెచ్‌బీ పరీక్షల గురించి తెలిపారు. కార్యక్రమంలో శాంతిఆశ్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీమోహన్, ఎంపీహెచ్ఈఓ తాతబాబు, ఎంపీహెచ్ఎస్ వీర్రాజు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన


బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ

జగ్గంపేట: పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్, బాలకల రక్షణ చట్టాలపై ఎస్సై రఘునందనరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. హస్టల్స్ దగ్గర కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పాఠశాల అధికారులకు సూచించారు. ర్యాగింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా చూడాలని, విద్యార్థినులకు ర్యాగింగ్ చట్టం గురించి తెలిపారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తమకి సమాచారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ లలితకుమారి, ఎస్సై రఘునందనరావు, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మడులు తడిసె.. రైతులు మురిసె

- వర్షంతో మెట్టలో చిగురించిన రైతుల ఆశలు
- వరి, పత్తి పంటలకు మేలు
- నారుమడులు వేసేందుకు సన్నద్ధం


కోటనందూరు మండలంలో వరి వేసిన నారుమడి

తుని: వర్షాభావంతో ఖరీఫ్ పంటలపై ఆశలు వదులుకున్న రైతులకు వరుణుడు భరోసా కల్పించారు. మెట్టకు ఆయువు పట్టుగా ఉన్న పంపా, తాండవ, ఏలేరు జలాయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవు. దీంతో రైతులు స్వల్పంగా కురిసిన వర్షాలకు బోరు బావులు ఉన్న చోట ఖరీఫ్‌కు సంబంధించి వరినారు వేశారు. ఇవి కూడా ఎండల తీవ్రతకు ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇలాంటి సమయంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు మళ్లీ ఆశలు చిగురింప చేశాయి. ఇప్పటికే నాటిన పత్తి, కూరగాయలు, వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. ఇదే విధంగా వర్షాలు పడితే ఖరీఫ్‌కు డోకా ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ప్రధానంగా వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతం మేర నారుమడులు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, మెట్ట భూముల్లో నారుమడులు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వర్షాలు తక్కువ శాతం కురిశాయి. అన్ని అనుకూలిస్తే ఆగస్టులో వరి నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పంపా, తాండవ జలాశయాల్లో కనిష్ట స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. ఏలేరు జలాశయానికి గోదావరి జలాలను విడుదల చేయడంతో రైతులు వరి సాగుకు శ్రీకారం చుట్టారు. ఇక పుష్కర కాలువకు త్వరలో నీటిని విడుదల చేయనున్నారు. దీంతో జగ్గంపేట నుంచి తుని వరకు పుష్కర ఆయకట్టుకు నీరు లభిస్తుండటంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కోసం నిరీక్షణ

తాండవ, పంపా ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్ సీజన్‌కు నీటి విడుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. తాండవ గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 365.8 అడుగులు ఉంది. 370 అడుగులకు చేరితే నీటి విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. క్యాచ్ మెంట్ ఏరియా పుష్కలంగా వర్షాలు కురిస్తే ఇన్‌ఫ్లో పెరుగుతుంది. దీంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు త్వరలో రైతులతో సమావేశం నిర్వహిస్తామని ప్రాజెక్టు కమిటీ చెబుతున్నారు. పంపా ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 105 అడుగులు కాగా ప్రస్తుతం 96 అడుగులు ఉంది. వంద అడుగులకు చేరితే నీటిని విడుదల చేస్తారు. ఆయకట్టు పరిధిలో 12,500 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంది. భారీ వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సీజన్ గట్టెక్కుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాభావం వల్ల రైతులు మిశ్రమ పంటల సాగు వైపు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తుని మండలం

నియోజకవర్గం	వరి సాగు విస్తీర్ణం ఎకరాల్లో
తుని	25,000
ప్రత్తిపాడు	22,000
జగ్గంపేట	42,000

వరి నారు వేశాను

ప్రస్తుతం బోరుబావి నీటి లభ్యత ఉన్న భూములో వరి నారు వేశాను. ప్రస్తుతం కురిసిన వర్షాలకు నారుమడి పెరుగుదల బాగుంది. పూర్తి స్థాయిలో నీటి లభ్యత వస్తేనే వరి సాగుకు అనుకూలత లభిస్తుంది. ప్రభుత్వం స్పందించి ఏలేరు జలాశయం నుంచి పంపాకు నీటిని విడుదల చేస్తే పూర్తి స్థాయిలో పంటల సాగుకు అవకాశం కలుగుతుంది. ప్రజాప్రతినిధులు రైతుల పరిస్థితిని గమనించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి.



– పోల్నాటి మాణిక్యాలరావు, రైతు,

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న రాముడు, విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని స్థానిక అగ్నిమాపక అధికారి కె.రాముడు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీప్రకాష్ స్కూల్‌లో స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ ప్రమాణ స్వీకారం విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాముడు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి బాధ్యతగా వ్యవహరించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. పదేళ్ల పాటు కష్టపడితే మంచి ఫలితాలు, న్యాయకత్వ లక్షణాలపై పట్టు సాధించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సీతారాణి, బి.ప్రసూన మౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజవరంలో అన్నసమారాధన

రౌతులపూడి: మరిడమ్మ తల్లి జాతర సందర్భంగా మండలంలోని రాజవరంలో అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారుగా రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీలో ఎస్సీలకు సముచిత స్థానం


రాజాను సత్కరిస్తున్న నాయకులు

తుని రూరల్: కాకినాడ సూర్య కళామందిర్‌లో ఈనెల 28న జరగనున్న ఎస్సీ సెల్ విభాగం జిల్లా సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి శ్రీనివాస్ రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఎస్సీలందరూ ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రాజాను ఎస్సీ సెల్ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ తుని నియోజకవర్గ అధ్యక్షుడు లంక కృపానందం, తుని, కోటనందూరు, తొండంగి మండలాల అధ్యక్షులు బండి నానిబాబు, కర్రి జగదీష్, దడాల గంగాధర్, దడాల సూరిబాబు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యంగా ఉండాలని పూజలు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని పట్టణంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు. సూర్యకుమార్ మాట్లాడుతూ, పార్టీ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యం పొందాలనే పూజలు చేశామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి మంత్రిగా ముద్రగడ అనేక సేవలు చేశారన్నారు. ముద్రగడ హయాంలో ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ముద్రగడ తనయుడు, పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గిరిబాబుకు నియోజకవర్గ ప్రజలు మనోధైర్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బసవేశ్వరుడికి అభిషేకాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి క్షేత్రంలో మంగళవారం బసవేశ్వరుడికి 21 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పండితులు శాస్త్రోక్తంగా పంచామృతాలతో పాటు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.


రాచపల్లిలో బసవేశ్వరుడికి అభిషేకాలు

ఇంకా పడని తల్లికి వందనం!


ఎలక్ట్రికల్ ఏఈతో తల్లికి వందనం గురించి మాట్లాడుతున్న సూర్యచంద్ర

జగ్గంపేట: అర్హత ఉన్నా చాలా మందికి తల్లికి వందనం రాలేదని సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గ్రామ పంచాయతీ, విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తల్లిదండ్రులు తిరుగుతున్నారన్నారు. ఈ మేరకు జగ్గంపేటలో ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతో మంది తల్లికి వందనం రాని బాధితులు తనని కలిశారన్నారు. స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ మాధురి, తహసీల్దార్ జేవీఆర్ రమేష్‌ను కలిసి వారి సమస్య చెప్పానన్నారు. సాంకేతిక ఇబ్బందులు వల్ల అర్హత ఉన్నా తల్లికి వందనం సొమ్ము ఖాతాల్లో పడలేదని తెలిపారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రతి మండలంలోనూ ఇలాంటి వారు 10 నుంచి 20 మందిపైగా ఉంటున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఒకేసారి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే ఆఫీసులు చుట్టూ తిరిగే అవస్థలు తప్పుతాయన్నారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో కుండపోతగా వర్షం పడింది. వేసవిని తలపించే విధంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతకు గురైన ప్రజలకు ప్రస్తుత వాతావరణం ఎంతో ఉపశమనం కలిగించింది. మంగళవారం కూడా పగటి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఈ వర్షంతో పొలాలకు దమ్ములు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల పరిధిలో జోరుగా వరినాట్ల పనులు సాగుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో కూడా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగనున్నాయి.

మద్దతు తెలపడమే నేరమా?

- ఉద్యమానికి మద్దతు తెలిపితే.. దుష్ప్రచారం
- ఏబీఎన్ చానల్‌పై మండిపడ్డ ఎంపీపీ రాజుబాబు


శంఖవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

శంఖవరం: మైనింగ్ రవాణాకు వ్యతిరేకంగా సామాజిక కార్యకర్త మేకల కృష్ణ చేపట్టిన ఉద్యమానికి తాము మద్దతు తెలపడమే నేరంగా ఏబీఎన్ చానల్ తనపై తప్పుడు ప్రచారం చేసిందని ఎంపీపీ పర్వత రాజుబాబు తెలిపారు. మంగళవారం శంఖవరంలోని ఆయన స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భారీ లోడుతో టిప్పర్ల రాకపోకలతో విద్యార్థులు, వృద్ధులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సామాజిక బాధ్యతతో దీక్ష చేస్తున్న వారికి మద్దతు తెలిపితే తమపై తప్పుడు ప్రచారం చేయడం సబవు కాదన్నారు. దీక్ష వద్దకు రాకుండా, వాస్తవాలు తెలియకుండా వార్తను ఏ విధంగా ప్రచారం చేస్తారన్నారు. తన 20 ఏళ్ల రాజకీయంలో మైనింగ్ ద్వారా డబ్బులు తీసుకున్నట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. లేకుంటే కోర్టులో పరువు నష్టం దావా వేస్తానన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం ఉద్యమం చేస్తే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ అవినీతి ఏంటో ఆ చానల్ వాళ్లు నిరూపించాలన్నారు. లేదంటే కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్వత వివేక్, మాజీ సర్పంచ్ పగడాల బాబ్జి, బుద్దాల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు జలకళ

- వరుణుడి కరుణతో పంట పొలాలు కళకళ
- పంటలపై పెరుగుతున్న రైతన్నల ఆశలు


సాగులో ఉన్న ఖరీఫ్ పంట

గండేపల్లి: వరుణుడి కరుణతో పంట పొలాల్లో జలకళ నెలకొంది. రెండు రోజుల నుంచి హఠాత్తుగా కురుస్తున్న వర్షాలతో బీడువారుతున్న పంట పొలాలు తడిచి ముద్దవుతున్నాయి. ఈ ఏడాది సాగులో ఉన్న ఖరీఫ్ పంటలు నీరులేక తడి ఆరిపోవడంతో దిగాలు చెందిన రైతన్నలకు వాతావరణ శాఖ తీపి కబురు చెప్పింది. హఠాత్తుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షానికి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బోర్లు, చెరువు నీరు ఆధారంతో మండలంలో ఇప్పటికే సుమారుగా 55 శాతం వరకు నాట్లు వేశారు. కొన్ని రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో సాగులో ఉన్న సార్వా పంటలు ఎండి నేల బీటలు వారుతుండంగా.. ప్రస్తుత వర్షానికి పంటలు చిగురిస్తున్నాయి. మండలంలోని 7,500 ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగుచేస్తున్నట్టు ఏఓ ఆర్.శ్రీరామ్ తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతన్నలు నారు జల్లుకున్నప్పటికి ఎండల తీవ్రతకు నారుమళ్లు ఎండిపోవడంతో అందుబాటులోకి వచ్చిన నాట్లతో రైతులు పంటల సాగును ప్రారంభించారు. మండలంలో కొన్ని చోట్ల ఇంకా నారు అందుబాటులోకి రాకపోవడంతో సాగు పూర్తికాలేదన్నారు. ఎండ తీవ్రత ఉన్నప్పటికి తుపాన్ కారణంగా వర్షం పడటంతో పంటల దిగుబడి పెరుగుతుందనే ఆశతో రైతన్నలు చివరి దశ కోసం ఎదురుచూస్తున్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు


వరిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

కోటనందూరు: నిస్సారమైపోతున్న పంట భూములను రక్షించుకోవాలంటే రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీజే నగరం, బొద్దవరం గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, సేంద్రీయ సాగుతో భూమి సారవంతం కావడంతో పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తన శుద్ధి చేసి సాగుచేసే వరిలో వచ్చే తెగుళ్లను నివారించొచ్చన్నారు. సాగు చేసే ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. మినుము, కంది విత్తనాలు ఆర్ఎస్‌కేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏఈఓలు పి.జగ్గప్పారావు, నల్లమిల్లి సురేష్, రైతులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

రౌతులపూడి: మండలంలోని రాజవరంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో విత్తనాలను రైతులకు అందజేశారు. ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి

ఏలేశ్వరం: రైతులు పొలాల్లో వేసే పంటలను నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ సూచించారు. మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యాన పంటల సాగు విస్తరణకు బిందు తుంపర సేద్య పరికరాలు రాయితీపై పొందవచ్చొన్నారు. ఆయిల్ ఫామ్ సాగును రైతులు చేపట్టాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి పొలాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. వరిగట్లపై నాటుకోవడానికి కందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్దా సూర్యప్రకాష్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటపై రైతులకు సూచనలు

గండేపల్లి: వరి పంటలో రైతులు ఎరువుల యాజమాన్యం పాటించాలని ఏడీఏ బుల్లిబాబు సూచించారు. వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన మంగళవారం మండలంలోని మురారిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంటీపీని ఆకరి దమ్ములో వేసుకుంటే 20 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు ఉపయోగించాల్సిన పనిలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హతకై సమస్యలుంటే పరిష్కరిస్తామని తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులను తక్షణమే చేయించుకోవాలన్నారు. వంద శాతం రాయితీతో కందులు, మినుము విత్తనాలు ఉచితంగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓటీసీ చంద్రమౌళి, వీఏఏ రేణుకాదేవి, రైతులు పాల్గొన్నారు.

దమ్ము దశలోనే జాగ్రత్తలు పాటించాలి

కిర్లంపూడి: పంటలకు చీడలు పట్టకుండా దమ్ము దశ నుంచే జాగ్రత్త తీసుకోవాలని ఏఓ సుధామాధురి అన్నారు. గెద్దనాపల్లిలోని రైతు సేవాకేంద్రంలో మంగళవారం స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు వేయాల్సిన ఎరువులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతులందరూ విధిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో ఇన్సూరెన్స్, కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు అందజేశారు.

ప్రతి రైతు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

జగ్గంపేట: వరి సాగు చేసిన ప్రతి రైతు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, అలాగే కౌలు రైతులు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని జగ్గంపేట ఏడీఏ జి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మల్లిసాల, కాండ్రేగుల గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి నరసింహం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శ్రీలీల, క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు, మార్కెట్ కమిటీ డైరక్టర్ గుమ్మల అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా కిట్లు అందజేత

తుని రూరల్: ఖరీఫ్ నారుమడుల్లో సూక్ష్మధాతు లోపాలను నివారించాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎస్.సూరవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలసి ఆయన క్షేత్రస్థాయిలో నారుమడులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, సూక్ష్మధాతు లోప నివారణకు జింక్ సల్ఫేట్ పిచికారి చేసి కాంప్లెక్స్ ఎరువులే కాకుండా.. రెండు కిలోలు యూరియా, కిలో పొటాషియం కలిపి రెండు దఫాలుగా వేయాలన్నారు. నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫిరాన్ 3జీ గులికలు 800 గ్రాములు వేయాలని సూచించారు. చిరుధాన్యాల సాగు, గట్లపై మినుము, కందులు సాగు చేయాలన్నారు. అందుకు అవసరమైన కిట్లను ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్ చింతంనీడి నాగసోమరాజు, ఏఈఓ కేవీ శివకుమారి, గ్రామ ఉద్యాన సహాయ అధికారి జి.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

కోటనందూరు: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మరిడమ్మ ఆలయ ఆవరణలో గురువారం ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, ఆయాలు, వాచ్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి మెనూ ఛార్జీ రూ.20 ఇవ్వాలని, గ్యాస్ సిలెండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, వేతనాలు, బిల్లులు 5వ తేదీలోపు ఇవ్వాలని, ప్రమాద బీమా కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ వర్కర్లకు మాస్కులు, గ్లౌజ్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ మండల కార్యదర్శి షేక్ పద్మ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై డ్రోన్లు

తొండంగి: రైతు సంఘాలు, వ్యవసాయ పొలాలకు సాగు పనుల నిమిత్తం 80 శాతం రాయితీపై యాంత్రీకరణ పథకం ద్వారా అందిస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎంఎంపీఎస్ పద్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఏవీ నగరంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎఫ్ఎంబీ రైతు సంఘాలకు ప్రభుత్వం 80శాతం రాయితీతో డ్రోన్లను అందజేస్తుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా సేంద్రీయ ఎరువుల వినియోగం, పంట బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఈవో మాధన సతీష్ వర్మ, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తుని: విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి సూచించారు. మంగళవారం పట్టణంలోని చెక్కా సూర్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో భువనసుందరి మాతృమూర్తి రాజమ్మ వర్ధంతిని పురస్కరించుకొని తల్లిదండ్రుల ప్రాధాన్యతతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతాలోపంతో శిథిలమైన రోడ్లు


ఇటీవల మరమ్మతులు చేసిన జగపతినగరం శివారున ప్రధాన రోడ్డు


గుంతలతో దర్శనమిస్తున్న జగపతినగరం-ప్రత్తిపాడు రోడ్డు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణాలను చేపడతామని ఎన్నికల సమయంలో చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నూతన రోడ్లకు బదులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. రాజుపాలెం నుంచి ప్రత్తిపాడు వరకు 6 కిలోమీటర్ల రోడ్డుకు సుమారు రూ.32 లక్షలతో మరమ్మతులు చేశారు. మళ్లీ వర్షాలకు యథావిధిగా గుంతలు ప్రత్యక్షమయ్యాయి. పనుల్లో నాణ్యత లేదని పాలకులు, అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.